'తెల్ల బంగారం' చేతికొచ్చేనా?

- కూలీల కొరతతో పత్తి రైతులకు తిప్పలు
- చెట్లపైనే కారిపోతున్న దూది పింజలు


భేతాళపాడులో చెట్లపైనే కారిపోతున్న పత్తి

జూలూరుపాడు: ఈ ఏడాది అధిక వర్షాలు, వరుస తుఫాన్ల కారణంగా పత్తి పంట దెబ్బతినడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. అరకొర పండిన పత్తి తీయడానికి కూలీల కొరత కారణంగా వందల ఎకరాల్లో దూదిపింజలు చెట్లపైనే కారిపోతుండటంతో రైతులకు తిప్పలు తప్పడం లేదు. ఈ ఏడాది జూలూరుపాడు మండల వ్యాప్తంగా 20 వేల ఎకరాల విస్తీర్ణంలో రైతులు పత్తి పంటసాగు చేశారు. ఇప్పటి వరకు మొదటి విడత మాత్రమే పత్తి తీయగా రెండు, మూడో విడతల్లో అధికంగా వచ్చిన పత్తి తీసేందుకు కూలీల కొరత రైతులను తీవ్రంగా వేధిస్తోంది. ఒకవైపు పత్తి పంటకు మార్కెట్‌లో సరైన గిట్టుబాటు ధర లభించక ఆందోళన చెందుతుంటే మరోవైపు పంట చేనులోనే చెట్లపై కారిపోతుండటంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. వందలాది ఎకరాల్లోని పత్తి పంట చేలోనే ఉండిపోవడంతో రైతులు ఏమి చేయాలో పాలుపోవడం లేదు. ఇటీవల తుఫాన్ల ప్రభావంతో కురిసిన అకాల వర్షంతో చేనులోనే పత్తి తడిసి ముద్ద అయింది. ఆ తరువాత పంట చేనులోనే ఎండకు ఎండిపోతుంటే పత్తి తీసేందుకు కూలీలు దొరకపోవడంతో రైతులు తలలు పట్టుకుంటున్నారు. చెట్లపైనే దూదిపింజలు పొగమంచుకు తడిసి ఎండకు ఎండిపోతుండటంతో రంగు మారుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తితీతలకు కూలీలు ఆసక్తి చూపడటం లేదని, కేజీకి రూ.25– రూ.30 ఇస్తామన్నా రావడం లేదని రైతులు చెపుతున్నారు. రోజుకు రూ.500 కూలీ ఇస్తామన్నా వచ్చేవారే లేరని వాపోతున్నారు.

ఒకవైపు మిర్చి కోతలు ప్రారంభం కావడం, మరోవైపు వేసవి సమీపిస్తుండటంతో పత్తి తీసేందుకు కూలీలు వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి అధిక వర్షాలు, తుఫాన్లతో పత్తి పంట దెబ్బతినడంతో దిగుబడి తగ్గిపోయిందని రైతులు చెపుతున్నారు. మొదటి విడతలో ఎకరానికి 3 నుంచి 5 క్వింటాళ్లు రాగా రెండోసారి 4 నుంచి 6 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉన్నా పత్తి తీసేందుకు కూలీల లేక చేలోనే పంట పాడైపోతోందని రైతులు వాపోతున్నారు. ఈ ఏడాది ఎకరానికి 5 – 10 క్వింటాళ్ల దిగుబడి మించని పరిస్థితి నెలకొంది. అక్టోబర్ నుంచి కొత్త పత్తి సీజన్ ప్రారంభం నుంచి పత్తి క్వింటాల్ ధర రూ.5,400 – రూ.6,100 ధర పలకగా, నవంబర్‌లో రూ.5,900 – రూ.6,400కు మించడం లేదలేదన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో పత్తి క్వింటాల్ ధర రూ.6,900 వరకు ఉన్నప్పటికీ నాణ్యత లేదని రూ.5,900 – 6,100కు మించి కోనడం లేదని రైతులు చెపుతున్నారు. ప్రభుత్వం ఈ ఏడాది పత్తికి క్వింటాకు రూ.7,521 మద్దతు ధర నిర్ణయించింది.

మూడు ఎకరాల్లో పత్తి తీయాలి..



మూడు ఎకరాల్లో పత్తి తీయాల్సి ఉంది. ఎకరం రూ.22 వేల చొప్పున మూడు ఎకరాలు కౌలుకు తీసుకున్నాం. కౌలు, పెట్టుబడి రూ.1.66 లక్షలు అయింది. రెండు విడతల్లో 3 ఎకరాల్లో 18 క్వింటాళ్ల పత్తి వచ్చింది. మూడో విడతలో 20 క్వింటాళ్లు వచ్చే అవకాశం ఉన్నా కూలీలు కొరతతో పంట చేనులోనే కారిపోతోంది. ఈ ఏడాది తీవ్ర నష్టం వచ్చింది.

– జవ్వాజి పెద్ద వెంకటస్వామి, రైతు, భేతాళపాడు

గిట్టుబాటు ధర రావడం లేదు..



మార్కెట్‌లో నాణ్యమైన పత్తికి కూడా గిట్టుబాటు ధర లభించడం లేదు. ఈ ఏడాది 8 ఎకరాల్లో పత్తి సాగు చేశాం. అధిక వర్షాల కారణంగా దిగుబడి తగ్గింది. రెండు ఎకరాల్లో పత్తి తీశాం. ఇంకా ఆరు ఎకరాల్లో చెట్లపైనే కారిపోతోంది. కేజీకి రూ.30 ఇస్తామన్నా కూలీలు రావడం లేదు. ఈ ఏడాది పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు.

– గోసు రామారావు, రైతు, పడమటనర్సాపురం

చేలోనే పత్తి కారిపోతోంది..



పది ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి సాగు చేశాం. కూలీల కొరత కారణంగా చేనులోనే పత్తి కారిపోతోంది. మూడో విడత పత్తి తీయాల్సి ఉంది. కూలీలు రాకపోవడంతో మేమే పత్తి తీస్తున్నాం. కేజీకి రూ.30 లేకపోతే రోజు కూలీ రూ.500 ఇస్తామన్నా కూలీలు రావడం లేదు. రూ.3.50 లక్షలు పెట్టుబడి అయింది.

– బాదావత్ వీరు, రైతు పడమటనర్సాపురం

ప్రభుత్వ భూమిని అమ్మేస్తున్నారు..


తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం పట్టణ పరిధి రామవరం రెవెన్యూ గ్రామం 11వ వార్డు వనందాసు గడ్డ ప్రాంతంలోని సర్వే నంబర్ 20లోని ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అవుతోందని స్థానిక గిరిజనులు బుధవారం తహసీల్దారు పుల్లయ్యకు ఫిర్యాదు అందజేశారు. స్థానిక గిరిజనేతరుడైన అంగూరు సురేష్ అనే వ్యక్తి స్థానిక ప్రజాప్రతినిదులు, బడా వ్యాపారస్తులతో చేతులు కలిపి పట్టపగలే జేసీబీతో పిచ్చి మొక్కలను తొలగించి ప్లాట్లు చేసి అమ్మేస్తున్నారని ఆరోపించారు. స్థానిక గిరిజనులకు ఇల్లు కట్టుకునే స్థలమే లేక ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని తాము కోల్పోయామని సేవాలాల్ సేన జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ నాయక్ అన్నారు. సదరు భూమిని కబ్జాదారుల చెర నుంచి విడిపించి స్థానిక వనందాసు గడ్డను గిరిజనులకు ఇంటి స్థలంగా కేటాయించాలని కోరారు. లేదంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని, కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. బానోత్ చందర్ నాయక్, భూక్యా మహేష్, బానోత్ వంశీ తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం


కొత్తగూడెంఅర్బన్: జనవిజ్ఞాన వేదిక భద్రాద్రి కొత్తగూడెం కమిటీ ఆధ్వర్యంలో బుధవారం సిద్ధార్థ ఒకేషనల్ కళాశాలలో చార్లెస్ డార్విన్ జీవపరిణామ సిద్ధాంతోద్యమం కార్యక్రమ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రధానవక్త ఎం.సుబ్బారావు మాట్లాడుతూ... జనవిజ్ఞాన వేదిక ప్రస్థానం గురించి ప్రజలలో శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంపొందించేందుకు జరిపిన అనేక అవగాహనా కార్యక్రమాల గురించి వివరించారు. జీవపరిణామ క్రమంలో మారిన పరిస్థితులకు వాటిని అనుగుణంగా మార్చుకున్న జీవులు రూపాంతరం చెంది బతికినవని, మార్చుకోని జీవులు మరణించాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బాధ్యురాలు కస్తూరి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.మోహనరావు, కార్యదర్శి తిరుపాలు, కళాశాల ప్రిన్సిపాల్ పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఏరియాలో ప్రమాదాల నివారణకు చర్యలు


రుద్రంపూర్ క్రాస్‌రోడ్డు వద్ద సర్కిల్‌ను పరిశీలిస్తున్న అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలో ఇటీవల ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రమాదాలలో అధికంగా కార్మికులు, వారి కుటుంబ సభ్యులు ఉండటంతో యాజమాన్యం నివారణ చర్యలపై దృష్టి సారించింది. ఈ మేరకు జాతీయ రహదారి రుద్రంపూర్ క్రాస్‌రోడ్డు వద్ద గతంలో చిన్నగా ఉన్న సర్కిల్‌ను తొలగించి పెద్దగా చేసేందుకు చర్యలు చేపట్టింది. ఈ మేరకు అధికారులు బుధవారం సర్కిల్‌ను రూ.10 లక్షల ఖర్చుతో పెద్ద సర్కిల్, వెల్‌కమ్ టూ కొత్తగూడెం ఏరియా హోర్డింగ్ ఏర్పాటు చేయనున్నారు. రుద్రంపూర్ కాలనీ, పెనగడప, రామవరం, సివిల్ ఆఫీస్ మార్గాలను విశాలంగా చేయనున్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాలలో భాగంగా పోలీసు శాఖవారు సూచనల మేరకు పనులు చేసేందుకు ప్రణాళికలను సిద్ధం చేశారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి..


సింగరేణి(కొత్తగూడెం): కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల సాధన కోసం ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర మహాసభ ఈనెల 31న ఇల్లెందులో జరగనుందని, జయప్రదం చేయాలని టీయూసీఐ రీజియన్ అధ్యక్షుడు పెద్దబోయిన సతీష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం కార్పొరేట్ ఏరియాలోని బాబూక్యాంపు, రైటర్‌బస్తీ డిపార్ట్‌మెంట్లలో జరిగిన సమావేశంలో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. నాగలక్ష్మి, కృష్ణ, సంధ్య, ప్రభాకర్, శాంత, హుస్సేన్, బి.రామకృష్ణ, భగవాన్, సునీత, సుమిత్ర, శిరిష పాల్గొన్నారు.

మహాసభకు తరలిరండి...

టేకులపల్లి: ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్, టీయూసీఐ అనుబంధ రాష్ట్ర రెండో మహాసభ ఈనెల 31న ఇల్లెందులో జరగనుందని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ యాకూబ్‌షావలీ పిలుపునిచ్చారు. ఈమేరకు బుధవారం టేకులపల్లి సింగరేణి హైటెక్ కాలనీలో కాంట్రాక్ట్ కార్మికుల సమావేశం జరిగింది. మాట్లాడుతూ... సింగరేణిలో కాంట్రాక్టు కార్మికులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు. కార్మికులు దుమ్ము, ధూళిలో పనిచేస్తున్నా నామమాత్రపు వేతనాలు ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం 14 నెలలు గడిచినా జీతాలు పెంచకపోవడం బాధాకరమన్నారు. ఈనెల 31న పోరాటాల పురిటిగడ్డ ఇల్లెందులో సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల రాష్ట్ర రెండో మహాసభ ఎల్లన్న భవనంలో జరుగుతుందని, ఈ మహాసభను జయప్రదం చేయాలని కోరారు. జరుపుల సుందర్, పాయం వెంకన్న, షఫీ, సైదులు, రవి, మంగ్య, శివయ్య, రామారావు, బాలు, వీసం, నరేష్, బాబు, నాగమణి, ఎర్రమ్మ పాల్గొన్నారు.

టీఎస్‌టీటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక

టేకులపల్లి: టీఎస్‌టీటీఎఫ్ టేకులపల్లి మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ మేరకు బుధవారం మండలంలోని వెంకట్యాతండా ప్రాథమిక పాఠశాలలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు భూక్యా మోహన్ అధ్యక్షతన కమిటీని ప్రకటించారు. మండల గౌరవ అధ్యక్షుడిగా అజ్మీర వెంకట్రావు, అధ్యక్షుడిగా గుగులోత్ శంకర్, ప్రధాన కార్యదర్శిగా గుగులోత్ సురేష్, కోశాధికారిగా భూక్యా బాలాజీ, జిల్లా ఉపాధ్యక్షుడిగా ఆలోతు స్వామి, రమేష్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా టేకులపల్లి మండలం నుంచి జిల్లా కార్యదర్శిగా సపావత్ సురేష్, జిల్లా ఉపాధ్యక్షుడిగా గంగావత రవిలను నియమించారు.

సంత ఏర్పాటు చేయాలి

జూలూరుపాడు: వెంగన్నపాలెం మెయిన్ సెంటర్‌లో వారపు సంతను ఏర్పాటు చేయాలని కోరుతూ హ్యూమన్ రైట్స్ సొసైటీ బహుజన అభ్యుదయ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు తంబర్ల నరసింహారావు బుధవారం ఎంపీడీఓ కరుణాకర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మిర్చి కోతల సీజన్ కావడంతో ఇతర రాష్ట్రాల నుంచి జూలూరుపాడు మండలానికి వలస కూలీలు వచ్చి కూలీ పనులు చేసి జీవనం సాగిస్తున్నట్లు చెప్పారు. వీరు నిత్యావసరాలు, కూరగాయలను వెంగన్నపాలెం మెయిన్ సెంటర్‌లోని దుకాణాల్లో కొనుగోలు చేస్తారన్నారు. ఇదే అదునుగా భావించిన కొందరు వ్యాపారులు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు చెప్పారు. వెంగన్నపాలెంలో సంత ఏర్పాటు చేయడం వల్ల ఇటు కూలీలకే కాకుండా మండల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ


క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ

పాల్వంచరూరల్: తెలంగాణ గ్రామపంచాయతీ కారోబార్, బిల్ కలెక్టర్, వర్కర్స్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్లను బుధవారం ఎంపీడీఓ విజయభాస్కర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ నారాయణ, ఈసీ పుల్లయ్య, సంఘం నాయకులు ఎస్.పూర్ణచంద్రరావు, తేనె సీతారాములు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో..

పాల్వంచ: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో విశ్వబ్రాహ్మణ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్లను తహసీల్దార్ వివేక్ బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాపర్తి వెంకటాచారి, వారధి సత్యానారాయణ, మొగులోజు సీతారామాచారి పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా బంద్

కొత్తగూడెంఅర్బన్: పట్టణంలో గురువారం, శుక్రవారం రెండు రోజులు కిన్నెరసాని నీటి సరఫరా బంద్ చేయడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ శేషాంజన్‌స్వామి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రేగళ్ల వద్ద మెయిన్ పైప్‌లైన్‌కు మరమ్మతుల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

పట్టు వస్త్రాలు సమర్పణ

పాల్వంచ: పట్టణంలోని గాంధీనగర్‌లో గల శ్రీ ముత్యాలమ్మ తల్లి ఆలయంలో అమ్మవారికి శ్రీకనకదుర్గ దేవస్థానం (పెద్దమ్మగుడి) ఆలయ కమిటీ సభ్యులు బుధవారం పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయం తరుపున ఎస్‌వీఆర్‌వీకే ఆచార్యులు, ప్రధాన అర్చకులు రమేష్, ఇంజమూరి మురళీ, విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి నాగేశ్వరరావు, కృష్ణార్జునరావు, ఎం.రంగమ్మ, రమాదేవి, గంగపూరి నాగేశ్వరరావు, పూజారి భాస్కర్ దాస్, కొత్తపల్లి సోమయ్య, కేసుపాక వెంకటేశ్వర్లు, రాంబాయమ్మ పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి అటవీశాఖ సహకరించాలి

పాల్వంచ: పట్టణంలోని వెంగళరావు కాలనీకి రూ.80 లక్షలతో రోడ్డు నిర్మాణాలు జరుగుతున్నాయని, ఆ రోడ్డుకు అటవీ శాఖ నుంచి ఇబ్బందులు తొలగించాలని హనుమాన్ యువజన సంఘం అధ్యక్షుడు ఆరుద్ర సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు బుధవారం జిల్లా ఫారెస్ట్ అధికారి జి.కృష్ణగౌడ్‌ను కలిసి వినతిపత్రం అందించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ఇల్లెందురూరల్: మండలంలోని పలువురు బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ నాయకులు బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. బాలాజీనగర్, కొమరారం గ్రామాలకు చెందిన బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో పులి సైదులు, పాయం స్వాతి, చంద్రశేఖర్, గుగులోత్ నాగార్జున్, తాటి రాంబాబు, ప్రశాంత్, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

టీజేఎస్ కమిటీ ఎన్నిక

పాల్వంచ: తెలంగాణ జనసమితి జిల్లా అధ్యక్షుడిగా బరగడి దేవదానం, ప్రధాన కార్యదర్శిగా పగడాల కరుణాకర్‌రెడ్డి నియామకమయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎం.కోదండరామ్ ఆదేశాల మేరకు బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎస్‌ఏ.రవూఫ్, కొమరం కాంతారావు, ఉపాధ్యక్షుడిగా మూల నాగిరెడ్డి, కార్యదర్శిగా తేజావత్ మాన్‌సింగ్, ప్రచార కార్యదర్శిగా పూనెం ప్రదీప్, కోశాధికారిగా నబీసాహెబ్, రైతు సంఘం అధ్యక్షుడిగా సురకంటి ప్రభాకర్‌రెడ్డి మహిళా అధ్యక్షురాలిగా కేశవభట్ల లక్ష్మి, లీగల్ అడ్వయిజర్‌గా కుడికాల ఆంజనేయులను ఎన్నుకున్నారు.

వెబ్ కౌన్సెలింగ్ వాయిదా

సింగరేణి(కొత్తగూడెం): ఈనెల 30న ఐదు కేంద్రాలలో (కార్పొరేట్, ఆర్జీ–1, భూపాలపెల్లి, శ్రీరామ్‌పూర్, మందమర్రి) సంస్థలో పనిచేస్తున్న మైనింగ్ సర్దార్ (డిప్లొమా హోల్డర్స్)కు కౌన్సెలింగ్ నిర్వహించి ఓవర్‌మెన్‌గా (టీఅండ్ ఎస్ – గ్రేడ్–సీ) ప్రమోషన్ కల్పించాల్సిన వెబ్ కౌన్సెలింగ్ వాయిదా వేసినట్లు సింగరేణి యాజమాన్యం బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. మళ్లీ నిర్వహించనున్న తేదీని త్వరలో ప్రకటించనున్నట్లు తెలిపారు.

వైద్యశిబిరానికి స్పందన

కొత్తగూడెంఅర్బన్: సంపూర్ణ సురక్ష కేంద్రం జీజీహెచ్ కొత్తగూడెం వారి ఆధ్వర్యంలో రైటర్ బస్తీలోని రైల్వే ఆరోగ్య కేంద్రంలో బుధవారం జిల్లా వైద్య, ఆరోగ్య ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ బాలాజీ ఆధ్వర్యంలో ఉచిత మెగా ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఐవీ, టీబీ అనుమానితుల నుంచి రక్త నమూనాలను సేకరించారు. అవసరమైనవారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు సందీప్, రాజేందర్, హెచ్ఐవీ ప్రోగ్రాం మేనేజర్ సత్యకుమార్, సెక్యూలర్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు మేనేజర్ రాజేంద్రప్రసాద్, సంపూర్ణ సురక్ష కేంద్రం సిబ్బంది ప్రియాంక, ప్రమీల, కృష్ణవేణి, ఏఎన్ఎం గంగభవాని, టీబీ సిబ్బంది రఫాయేలు, కృష్ణవేణి, రైల్వే సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అల్పాహారం

కొత్తగూడెంఅర్బన్: జమాతే ఇస్లామీ హింద్ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ బాసిత్ ఆధ్వర్యంలో బుధవారం బూడిదగడ్డ ప్రభుత్వ పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు బిస్కెట్లు, పండ్లు అల్పాహారంగా గౌరి శంకర్ వారి కుటుంబ సభ్యుల సహకారంతో అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మధురవాణి మాట్లాడుతూ.. విద్యార్థులకు నెలరోజు పాటు అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో భరత్ సందీప్, కాంతి రేఖ ఉపాధ్యాయులు దస్తగిరి, బాలు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమమే ఐజేయూ లక్ష్యం

సూపర్‌బజార్(కొత్తగూడెం): జర్నలిస్టు సంక్షేమమే లక్ష్యంగా టీయూడబ్ల్యూజే (ఐజేయూ) పనిచేస్తుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాంనారాయణ అన్నారు. స్థానిక కొత్తగూడెం క్లబ్‌లో బుధవారం జిల్లా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు, హెల్త్‌కార్డులు, ఇళ్ల స్థలాల సాధన కోసం యూనియన్ నిరంతరం పోరాడుతుందన్నారు. ఫిబ్రవరిలో జరగనున్న జిల్లా తృతీయ మహాసభల నేపథ్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

సింగరేణిలో స్ట్రక్చరల్ సమావేశం


మాట్లాడుతున్న నాయకులు, అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా సింగరేణి ప్రధాన కార్యాలయంలో బుధవారం నిర్మాణాత్మక స్ట్రక్చరల్ సమావేశం గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. వాటిలో ప్రధానంగా కొత్తగూడెం మెయిన్ ఆస్పత్రిలోని క్యాజువాలిటీలో ఈసీజీ మానిటర్, ప్రతీవార్డులో స్టాఫ్ నర్సుల కోసం వాష్, ఏసీ రూములు కల్పించాలని, భద్రాత సిబ్బందికి నాణ్యమైన యూనిఫాం క్లాత్, షూ, రెయిన్ కోట్లు, తాగునీటి సౌకర్యం సరఫరా చేయాలని, సెంట్రల్ వర్క్‌షాపు, మెయిన్ ఆస్పత్రి సెక్యూరిటీ పోస్టుల వద్ద లైటింగ్, ఫ్యాన్లు, కుర్చీలు, ఏర్పాటు చేయాలని కోరారు. ఈ అంశాలపై సమీక్షించి వీలైనంత త్వరగా సమస్యలను పరిష్కరిస్తామని జీఎం (ఐఆర్ పీఎం) తెలిపారు.

క్రమశిక్షణతో చదువుకోండి..


విద్యార్థినులతో మాట్లాడుతున్న విద్యా చందన

టేకులపల్లి: విద్యార్థినులు ఏ సమస్య ఉన్నా నిర్భయంగా చెప్పాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన అన్నారు. ఈ మేరకు బుధవారం రాత్రి మండల కేంద్రంలోని గిరిజన కళాశాల బాలికల వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహం వార్డెన్ లేకపోవడంతో విద్యార్థినులతో మాట్లాడారు. సౌకర్యాలను పరిశీలించారు. పారిశుద్ధ్యం మెరుగుపరుచుకోవాలని, అలాగే వ్యక్తిగత పరిశుభ్రతపై దృష్టి పెట్టాలని సూచనలు చేశారు. భవిష్యత్‌లో మంచి ఉద్యోగాలు సంపాదించి తల్లిదండ్రులకు పేరు తీసుకరావాలన్నారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. మళ్లీ రెండు రోజుల్లో వస్తానని ఇక్కడే రాత్రిపూట బస చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఏపీఎం రవికుమార్, ఏపీఓ శ్రీనివాస్, సీసీ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ అధికారులతో సమీక్ష..

ఇల్లెందు: మున్సిపల్ పాలకవర్గం పదవీ కాలం ముగిసి ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభమైన తరుణంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన బుధవారం ఇల్లెందు మున్సిపాలిటీని సందర్శించారు. అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నూటికి నూరుశాతం ఇంటి పన్నులు వసూలు లక్ష్యంగా పని చేయాలని సూచించారు. రూ.1.47 కోట్ల ఇంటి పన్నులు వసూలు చేయాల్సి ఉందని తెలిపారు. 6,010 నల్లా కనెక్షన్లు, ఆరువేల గృహాలు ఉన్నాయని అన్నీ సక్రమంగా వసూలు చేయాలని సూచించారు. వచ్చే వేసవికాలం దృష్ట్యా పట్టణంలో మంచినీటి ఎద్దడి రాకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, మేనేజర్ అంకుషావలీ, డీఈ మురళీ, ఏఈ శంకర్, ఆర్ఐ శ్రీనివాస్, అకౌంట్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

సమయపాలన పాటించాలి


సమావేశానికి హాజరైన అంగన్‌వాడీ టీచర్లు

జూలూరుపాడు: అంగన్‌వాడీ టీచర్లు సమయపాలన పాటించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగమణి అన్నారు. బుధవారం జూలూరుపాడు అంగన్‌వాడీ కేంద్రం–1లో జూలూరుపాడు సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతీ అంగన్‌వాడీ టీచర్ తప్పనిసరిగా యూనిఫాంలో ఉండాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు తెరిచి ఉంచాలని చెప్పారు. పిల్లలు, గర్భిణులు, బాలింతల వివరాలను యాప్‌లో ఆన్‌లైన్ చేయాలని సూచించారు. ప్రీ స్కూల్ పిల్లలకు టైమ్ టేబుల్ ప్రకారం విద్యాబోధన చేయాలన్నారు. పిల్లలు, తల్లులకు పౌష్టికాహారం సక్రమంగా అందించాలని, అదేవిధంగా అంగన్‌వాడీ టీచర్లు విధుల పట్ల నిర్లక్ష్యం తగదన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సీతామహాలక్ష్మి, పుల్లమ్మ, తాటి లక్ష్మి, ఆదిలక్ష్మి, సుజాత, సీహెచ్ సీతామహాలక్ష్మి, సుభద్ర, నీల, సక్కుబాయి, ఝాన్సీ, నాగమణి, శివకుమారి, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంపై దృష్టి పెట్టండి..


నర్సరీ వివరాలు తెలుసుకుంటున్న డీపీఓ


సుజాతనగర్: గ్రామాల్లోని నర్సరీల్లో నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలు సిద్ధం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి అన్నారు. సుజాతనగర్‌లో ఏర్పాటు చేసిన నర్సరీని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సరీల్లో పెంచుతున్న మొక్కల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. మాట్లాడుతూ... హరితహారంలో భాగంగా నాటే మొక్కలను పెంచే నర్సరీల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. నాటిన మొక్కలను ఎండ నుంచి సంరక్షించే ఏర్పాట్లు చేయాలన్నారు. మొక్కలు ఆరోగ్యంగా పెరిగేలా నర్సరీ నిర్వాహకులు దృష్టి పెట్టాలని కోరారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ రమణ, ఎంపీడీఓ భారతి, ఎంపీఓ శ్రీనివాస్, పంచాయతీ సెక్రటరీ చెన్నకేశవరావు, సిబ్బంది కూరపాటి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ఉద్యోగులకు శిక్షణ


శిక్షణకు హాజరైన ఉద్యోగులు

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా ఉద్యోగులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. బుధవారం ఇల్లెందు ఆఫీసర్స్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శాప్ ఫైల్ లైఫ్ సైకిల్ మేనేజ్‌మెంట్‌పై ఈఆర్‌పీ డిపార్ట్‌మెంట్ కార్పొరేట్ వారు ఇల్లెందు ఏరియాలో వివిధ విభాగాల్లో పనిచేసే అధిపతులకు ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. జీఎం కృష్ణయ్య మాట్లాడుతూ... మ్యానువల్ ఫైల్ డిస్పాచ్ నుంచి ఆన్‌లైన్ ఫైల్ డిస్పాచ్‌కు త్వరలో మారుతున్నామని వివరించారు. ఈ మార్పు వల్ల ఖర్చు, సమయం, శ్రమ ఆదా చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం బి.వెంకటేశ్వర్లు, పీఓ(కేఓసీ) గోవిందరావు, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, మేనేజర్ ఐటీ సుధాకర్, కార్పొరేట్ ఐటీ విభాగం కిరణ్‌కుమార్, శంకర్, రమ్య, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

అవకతవకలపై విచారణ జరిపించండి..


మాట్లాడుతున్న ఆవునూరి మధు

టేకులపల్లి: సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా ప్రభుత్వం ఆరు గ్యారంటీలు అమలు చేయాలని కోరుతూ ఫిబ్రవరి 20న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు ఆవునూరి మధు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం టేకులపల్లి మండలం బద్దుతండాలో కార్యకర్తల జనరల్ బాడీ జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. మాట్లాడుతూ... ఇందిరమ్మ రాజ్యం ఇంటింటా సౌభాగ్యం అంటూ 420 వాగ్దానాలు చేసి 14 నెలలు గడుస్తున్నా ఒక్క హామీ కూడా పరిష్కారానికి నోచుకోలేదన్నారు. ఉచిత బస్సు మినహా ఏ ఒక్క హామీ పరిష్కారం కాలేదని విమర్శించారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో జరుగుతున్న అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. పోడు భూములకు పట్టాలు ఇస్తామని ఇంతవరక ఇవ్వలేదన్నారు. జిల్లాలో ప్రారంభమైన సీతారామ ప్రాజెక్ట్ నీటిని మొదటి ప్రాధాన్యం కొత్తగూడెం జిల్లాలోని ఏజెన్సీ మండలాలకు ఇవ్వాలని మిగులు జలాలను ఇతర ప్రాంతాలకు తరలించాలని పేర్కొన్నారు. మహాలక్ష్మి, కౌలు రైతుల, గృహ జ్యోతి, విద్యా భరోసా కార్డు, పెన్షన్, ఉద్యోగ అవకాశాలు, ఆరోగ్యశ్రీ లాంటి పథకాలను ఒక్కటి కూడా అమలు చేయడం తెలిపారు. ఆరు గ్యారంటీలతోపాటు ఏడో గ్యారెంటీ ప్రజాసామిక హక్కు అని చెప్పి ప్రశ్నిస్తున్న ఎంతోమంది మేధావులను, విప్లవకారులను పీడీయాక్ట్, ఉపా కేసుల పేరుతో నిర్బంధిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ముక్తి సత్యం, తుపాకుల నాగేశ్వరరావు, జె.సీతారామయ్య, సారంగపాణి, ఎండీ రాసుద్దీన్, డి.ప్రసాదు, కల్తి వెంకటేశ్వర్లు, హర్ష్య, పొడుగు నరసింహారావు, ఆరెం నరేష్, పర్శిక రవి, మోకాళ్ల రమేష్, మిడిదొడ్డి నాగేశ్వరరావు, ముసలి సతీష్, ఆదిలక్ష్మి, వంకుడోత్, సరోజ, వెంకటమ్మ, కల్తి రాములమ్మ, రాపర్తి లక్ష్మి, సూర్ణపాక నాగేశ్వరరావు, ఎట్టి నరసింహ రావు, జక్కుల రాంబాబు, సత్యనారాయణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.